

సిఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - చింతపల్లి: చింతపల్లిలో ఈనెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ ఎత్తున పోలీస్ బలగాలను ఉపయోగిస్తున్నట్టు అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. చింతపల్లి సమీపంలో హెలిపాడ్ నిర్మాణ పనులు పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, చింతపల్లి పరిసరాలలో కోరుకొండ, అన్నవరం, గాలికొండ సప్పర్ల, మంప, దారకొండ ప్రాంతాల్లో గ్రేహౌండ్స్ స్పెషల్ పోలీసు బలగాలు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ చెప్పారు, ఇతర జిల్లాల నుండి పోలీస్ బలగాలను రప్పించి శాంతి భద్రతల పరిరక్షణకు ఉపయోగిస్తున్నామని చెప్పారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్‌పి

బెదిరేది లేదు..

పలుచోట్ల అంగన్‌వాడీలు భిక్షాటన, ధర్నాలు


పాడేరులో భిక్షాటన చేపడుతున్న అంగన్‌వాడీలు


అరకులో అందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- యంత్రాంగం

అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు వేసి ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతున్నా అదిరేది లేదని అంగన్‌వాడీలు తేల్చి చెప్పారు. అల్లూరి జిల్లాలో పలు చోట్ల అంగన్వాడీల వంటా వార్పు, భిక్షాటన, ధర్నాలు చేపట్టారు. మంగళవారం 8వ రోజు కూడా సమ్మెను ఉధృతంగా కొనసాగించారు

పాడేరు: సమస్యలను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలో అంగన్వాడీలు చేపడుతున్న సమ్మెలో భాగంగా మంగళవారం బిక్షాటన నిర్వహించారు. అంగన్వాడీల సమ్మె 8వ రోజు కొనసాగింది. తమ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ అంగన్వాడీలు రోజుకో రీతిన నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంగన్వాడీల పోరు రోజురోజుకీ ఉదతం అవుతుంది. పాడేరులో అంగన్వాడీల బిక్షాటన ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగింది. రోడ్డు పక్కన బైఠాయించిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు వాహనదారులను ఆపి భిక్షాటన చేస్తూ తమ నిరసన కొనసాగించారు. సిఐటియు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎల్ సుందర్రావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వం తక్షణమే స్పందించి మొండి వైఖరిని విడనాడకపోతే తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. **అరకులోయ:**అరకులోయ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ఆందోళన నిర్వహించారు. అరకులోయ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఐసిడిఎస్ కార్యాలయం నుంచి పాలు తరలించడానికి సిద్ధంగా ఉన్న వ్యాన్ అంగన్వాడి కార్యకర్తలు అడ్డుకున్నారు.ఐసిడిఎస్ సూపర్వైజర్ బలవంతంగా తీసుకెళ్లే ప్రయత్నం చేయడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించే వరకు అంగన్వాడి సెంటర్లు తెరిపించే ప్రసక్తి లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. అధికారులు బెదిరింపులకు లొంగేదీ లేదన్నారు.ఎనిమిది రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్న కనీసం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. బలవంతంగా అంగన్వాడి కేంద్రా లను తెరిచే ప్రయత్నం చేయిస్తే ఉపేక్షించబోమని వారు హెచ్చరించారు. వ్యాన్ ను ఐసిడిఎస్ ఆఫీస్ లోనే నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు యుటిఎఫ్ మద్దతు

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో అంగన్వాడీల సమ్మెకు యుటిఎఫ్ మండల శాఖ సంపూర్ణ మద్దతు తెలిపింది. సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యం.ధర్మారావు మాట్లాడుతూ, అంగన్వాడి వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు.యుటిఎఫ్ మండల అధ్యక్షులు సమరెడ్డి రాజు మాట్లాడుతూ,ముఖ్యమంత్రి మాట నిల బెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సత్యనారాయణ, గోపి, సర్వ శిక్ష అభియాన్ నాయకులు అనిల్‌కుమార్, ఈశ్వర్రావు, సురేష్ పాల్గొన్నారు.


కొయ్యూరులో...

అనంతగిరి:అంగన్వాడీల సమ్మెకు టిడిపి మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు టి.బుజ్జిబాబు, బొర్రా పంచాయతి సర్పంచ్ జె.అప్పారావు మాట్లాడుతూ, అంగన్వాడి వ్యవస్థను వైసిపి రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పండుతుందన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విపలమైందని ు విమర్శించారు సమస్య పరిష్కారం అయ్యేవరకు టిడిపి అండగా ఉంటుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు దయానిధి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

మారేడుమిల్లి :ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చూపించే వరకు తమ దీక్షలు కొనసాగుతాయని సిఐటియు జిల్లా నాయకురాలు కెవి రామలక్ష్మి అన్నారు. మండలంలోని తహాశీల్దారు ముందు అంగన్వాడి, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం నాటికి ఎనిమిదవ రోజుకి చేరింది. ఇందులో భాగంగా మంగళవారం వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ నాయకులు నిర్మల కుమారి, ప్రసూన మారేడుమిల్లి మండలం, వై రామవరం అప్పర్ పార్ట్ అంగన్వాడీ మినీ అంగన్వాడిలు పాల్గొన్నారు.

చింతూరు : చింతూరులో ఎనిమిదవ రోజు సమ్మెలో భాగంగా టెంట్ వద్ద వంటా వార్పు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దీనిని సిఐటియు మండల అధ్యక్షురాలు సవలం వెంకటరమణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముచ్చిక, జయమ్మ, నూకరత్నం, సత్యవతి, రాజకుమారి సుజాత, దుర్గ, చుక్కమ్మ, చిట్టమ్మ, కళ్యాణి విజయశ్రీ పాల్గొన్నారు.

విఆర్.పురం : మండల కేంద్రం రేఖపల్లి జంక్షన్‌లో అంగన్వాడీల 8వ రోజు ఆందోళనలో భాగంగా వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. యుటిఎఫ్ నాయకులు సున్నం రాజులు, సోడి నాగేశ్వరరావు అంగన్వాడీల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి. యుటిఎఫ్ మండల నాయకుడు రామకృష్ణ, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనం సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంకు సత్తిబాబు, వడ్లది రమేష్, కారం సుందరయ్య, లక్ష్మణరావు, సిరపు తాతబాబు, కుంజ కన్నయ్య, సోడి మల్లయ్య, హజరత్, గూటాల శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు సున్నం రంగమ్మ, రాజేశ్వరి, నాగమణి పాల్గొన్నారు.

కొయ్యూరు : మండల కేంద్రంలోని అంగన్వాడీలు వంట వార్పు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు ఎంపీడీవోకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. గిరిజన సంఘం జిల్లా నాయకుడు సూరిబాబు, సిఐటియు నాయుడు వై అప్పలనాయుడు, యూనియన్ నాయకులు నాయకురాలు ముత్యాలమ్మ, అచ్చియమ్మ పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని అంగన్వాడీల సమ్మె స్థానిక బస్టాండ్ సెంటర్లో 8వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా వీరికి స్థానిక సీపీఎం నాయకులు మద్దతు తెలియ జేశారు.

రాజవొమ్మంగి : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ తచేస్తూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలు మంగళవారం రాజవొమ్మంగిలో భిక్షాటన చేశారు. తొలుత రాజవొమ్మంగి ఆర్అండ్బి అతిథి గృహం ఎదురుగా శిబిరానికి మండలంలోని అంగన్వాడీలు వండలాదిగా చేరుకొని 8వ రోజు నిరసనలను కొనసాగించారు. అనంతరం భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల కార్యదర్శి కె వెంకటలక్ష్మి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు, యూనియన్ మండల నాయకులు చిన్ని కుమారి, రమణి, సుందరమ్మ, సత్యవతి, రాజేశ్వరి, మంగ, రాణి పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

కేంద్రం తెరవడాన్ని అడ్డుకున్న ఎంపిటిసి

విఆర్.పురం : మండలంలోని చిన్నమట్టపల్లి గ్రామ సచివాలయం సిబ్బంది ఆ గ్రామంలోని అంగన్వాడీ సెంటర్‌ను తెరవడానికి మంగళవారం ప్రయత్నించగా స్థానిక ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, స్థానికులు వారిని అడ్డుకొని తిరిగి పంపించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సోడి తమ్మయ్య పండా వెంకటేష్ నాగయ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

ప్రశ్నించిన అంగన్వాడీలు.. వెనుదిరిగిన అధికారులు..

కూనవరం : కూనవరం బెస్త బజార్ అంగన్వాడీ సెంటర్‌లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్, పంచాయతీ అధికారులు, సిబ్బంది మంగళవారం తాళాలు బద్దలు కొట్టి సరుకులు అంచనా వేస్తుండగా, విషయం తెలుసుకున్న అంగన్వాడీలు అక్కడకు చేరుకొని వారిని నిలదీశారు. తాము లేకుండా సెంటర్ తాళాలు ఎలా పగలగొడతారని, ప్రభుత్వం పంపిన సర్క్యులర్ చూపమని అంగన్వాడీలు అడగడంతో వారు నెమ్మదిగా అక్కడ నుండి జారుకున్నారు. మండలంలోని రేగులపాడు గ్రామంలో తాళాలు బద్దలు కొడుతున్న అధికారులను సీపీఎం కార్యకర్తలు అడ్డుకొని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సీతారామయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటన ఎవరి కోసం?

- హైడ్రోపవర్ ప్రాజెక్ట్‌లను రద్దు చేయాలి
- జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలి
-చింతపల్లి సభలో నిరసన వ్యక్తం చేయండి
-సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స పిలుపు



మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి- చింతపల్లి:ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేస్తూ ముఖ్యమంత్రి జగన్ ప్రకటన చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనరస డిమాండ్ చేశారు. చింతపల్లి మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్‌తో కలిసి అప్పలనరస మాట్లాడుతూ, ఆదివాసి హక్కులను తుంగలో తొక్కి అటవీ సంపదను జగన్ తన మిత్రులకు ధారాదత్తం చేయడానికి చూస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చింతపల్లి పర్యటన సందర్భంగా హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు పై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో 4 చోట్ల హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి జగన్ ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, నిర్వాసిత ఆదివాసీ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యమం నిర్వహించారని గుర్తు చేశారు. అదాని, శిరిడీ సాయి గ్రీన్ ఎనర్జీ వంటి కార్పొరేట్ కంపెనీలకు ఆదివాసీ గిరిజన గ్రామ సభ ఆమోదం లేకుండా అనుమతి ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఆదివాసి హక్కులు, చట్టాలు కాలరాస్తూ బోయ/వాల్మీకి బెంతు ఒరియాలను ఎస్టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీ తీర్మానం పై జగన్ బహిరంగగా ఆదివాసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివాసులకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు లేకుండా గిరిజనేతరులతో భర్తీ చేయడం తగదన్నారు. గిరిజన సలహా మండలి తీర్మానం ప్రకారం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసి, కేంద్ర ప్రభుత్వంతో ఉన్న సంబంధాలతో ఆదివాసులకు నూరు శాతం రిజర్వేషన్ను చట్టబద్ధత కల్పించవచ్చని కావాలనే జగన్ ప్రభుత్వం ఆదివాసులకు ద్రోహం చేస్తుందని విమర్శించారు. ఆదివాసి ప్రాంతమైన చింతపల్లి లో జగన్ పర్యటన ఎవరికోసం ఎందుకోసమని ప్రశ్నిచారు.ఆదివాసి ప్రాంతంలో ఐటీడీఏ పరిధిలో ఆదివాసి స్పెషల్ డిఎస్సి ఇవ్వకుండా ఆదివాసి యువతకు మోసం చేశారన్నారు. నవరత్నాల పేరుతో ఆదివాసీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారన్నారు. అటవీ సంరక్షణ చట్టం ను సవరించి ఆదివాసీ గ్రామ సభలకు ఉన్న అధికారాలు రద్దు చేసి కార్పొరేట్ కంపెనీలకు అపారమైన ఖనిజ సంపద దోచిపెట్టడానికి మోడీకి జగన్ ప్రభుత్వం మద్దతు ఇస్తుందని దుయ్యబట్టారు.

సంక్షేమ పథకాలు గొప్పగా ఇస్తున్నట్టు ప్రచారం చేస్తున్న జగన్ ప్రభుత్వం ఆదివాసి ప్రాంతంలో 14వేల మందికి జగనన్న ఇళ్ల పట్టాలిచ్చి ఒక్క ఇల్లు కూడా నిర్మాణం చేయలేదని విమర్శించారు. ఆదివాసులకు 45 సంవత్సరాలకే పెన్షన్ ఇస్తానన్న హామీ ఏమైందని అడుగడుగునా ఆదివాసులకు వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం ద్రోహం చేస్తుందని అన్నారు. నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను షెడ్యూల్‌లో చేర్పించాలని అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నా అసెంబ్లీలో తీర్మానం చేయకుండా బెంతు ఒరియా, బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించడానికి అసెంబ్లీ చేసిన తీర్మానంపై ముఖ్యమంత్రి ఆదివాసులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తుపాన్ కారణంగా నష్టపోయిన కాఫీ, వరి, రాజ్మా చికుడు పంటకు నష్టపరిహారం ఇవ్వాలని, కాఫీ రైతులకు చెల్లించ వలసిన 62 కోట్ల బకాయి సొమ్ము రైతుల ఖాతా లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు ఎ.బుజ్జీ బాబు, సూరిబాబు, చిరంజీవి పాల్గొన్నారు.


అగ్ని ప్రమాద బాధితులకు సహాయం అందజేస్తున్న సిపిఎం నేతలు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని సీతంపేట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన ముత్యాల చిన్న వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను సిపిఎం నాయకులు మంగళవారం పరామర్శించారు. సిపిఎం తరుపున బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు, చీరలు, లుంగీలు, టవల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో చిన్న వెంకటేశ్వర్లుకు భారీ ఆస్తి నష్టం జరిగిందని, కట్టుబట్టలతో రోడ్డు పడ్డ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, లక్ష్మణరావు, వడ్లది రమేష్, గుటాల శ్రీనివాసరావు, సోడి మల్లయ్య, కుంజ కిరణ్, తాతబాబు, శ్రీనివాసరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యా వనరుల కేంద్ర సిబ్బందికి సహాయం

ప్రజాశక్తి- కూనవరం

మండలంలోని విద్యావనరులు కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు లేక అనేక ఇబ్బందులకు పడుతున్న సిఆర్‌పిలు, అటెండర్, కంప్యూటర్ సిబ్బందికి యుటిఎఫ్ కూనవరం మండల కమిటీ తరపున 25 కిలోల బియ్యం, మంచి నూనె, కూరగాయలు, కందిపప్పు, టామాట, బంగాళదుంపలు, చింతపండు, కారం, పసుపు, ఉల్లిపాయలు తదితర వస్తువులను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అనిగె.నాగేశ్వరావు, పి.కన్నారావు, తుష్టి సుబ్బారావు, యం.రాంబాబు, బపన్న దొర, రజినీ కుమార్ రెడ్డి, సీత, సత్యవతి, శాంత, కుమారి, మహతి, గౌతమి, ప్రమీళ, నాగ దుర్గ, యశోద తదితరులు పాల్గొన్నారు.


సహాయం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలపై నిరసన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఎనర్జీ అసిస్టెంట్స్, సెక్రటరీలకు పాత సర్వీస్ రూల్స్ అమలు చేస్తూనే వారికి ఇతర అలవెన్స్ ఇవ్వాలని కోరుతూ మంగళవారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద ఎనర్జీ అసిస్టెంట్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు లోతా ప్రసాద్, సున్నం తమ్మయ్య, బి.వెంకటరమణ మాట్లాడుతూ ప్రొబేషన్ డిక్లరేషన్, జిఎస్‌డబ్ల్యూఎస్, సచివాలయ ఉద్యోగుల మాదిరిగానే 010 ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామ/వార్డు సచివాలయ జాబ్‌చార్ట్‌ను అనుసరించే విధంగా ఆదేశాలు ఇచ్చి ఎనర్జీ అసిస్టెంట్, సెక్రటరీలను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని, ఈనాటి వరకు అమలు కానీ సీఎల్, ఈసీ మెడికల్, ఇతర సెలవులను సచివాలయ ఉద్యోగుల్లాగే అమలు చేయాలని, సచివాలయ పరిధిలోనే పనిచేసే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈహెచ్ఎస్ హెల్త్ కార్డులను మంజూరు చేయాలని, ఈపీఎఫ్ కాకుండా సచివాలయ ఉద్యోగులకు మాదిరిగానే జిపిఎస్ అమలు చేయాలని, పనిచేసే క్రమంలో విద్యుత్ ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు, యూనియన్ నాయకులు కొంగర చినబాబు, ఆవూరి శ్రీనివాసు, యు.చంద్ర శివ, వీరబోయిన వరప్రసాద్, ఈ గణేష్, కె దుర్గారావు, ఎస్ కన్నపురాజు దొర, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

బాల్య వివాహాల నియంత్రణకు కృషి

ప్రజాశక్తి-కొయ్యూరు : బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యు.చీడిపాలెం గ్రామ సచివాలయ మహిళా పోలీసు జ్యోతి సూచించారు. పలకజీడిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, దుష్పరిణామాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చేయడం చట్ట ప్రకారం నేరమని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని బాలికలకు సూచించారు.

234 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని చింతలపూడి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు 234 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి తెలిపారు. రైతుల కల్లాల వద్దకే సిబ్బంది వచ్చి తనిఖీ చేసుకొని, తేమ శాతం సరిచూసుకొని ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులందరూ సంబంధిత రైతు భరోసా కేంద్రాల వద్ద సిబ్బందిని సంప్రదించాలని కోరారు. క్వింటాకు సామాన్య రకం రూ.2183 వరకు ప్రభుత్వం ధర ఇస్తుందన్నారు. గ్రామ వాలంటీర్లు రైతులకు సహాయపడాలని సూచించారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఏమైనా సహాయం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 1967కు ఫిర్యాదు చేయాలని సూచించారు.


రైతుల నుండి కొనుగోలు చేసిన ధన్యాన్ని లోడ్ చేస్తున్న దృశ్యం


తహశీల్దారుకు సమస్యను వివరిస్తున్న సిపిఎం నేతలు ఐవి, రాము

పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని ఆపాలని వినతి

ప్రజాశక్తి-ఎటపాక

మండలంలోని లక్ష్మీదేవిపేట రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల్లో పీసా, 1/70 వంటి గిరిజన చట్టాలను లెక్కచేయకుండా చేస్తున్న పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని ఆపాలని సిపిఎం నాయకులు మంగళవారం మండల తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఐవి మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం అప్పటి తహసీల్దారు వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది, సిపిఎం నాయకులు కలిసి అక్రమంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు నిర్మాణాన్ని అడ్డుకోవడం జరిగిందని తెలిపారు. ఈ నాలుగేళ్ల కాలంలో పెట్రోల్ బంక్ యజమాని అనేక తప్పుడు పద్ధతుల్లో పర్మిషన్లు తెచ్చుకొని పెట్రోల్ బంకు నిర్మిస్తున్నాడని ఆరోపించారు. నిర్మించ కూడదని కోర్టు స్టే ఇచ్చిందని, దానిని కూడా లెక్కచేయకుండా పెట్రోల్ బంక్ నిర్మాణం చేస్తున్నారని పేర్కొన్నారు. బంక్ నిర్మాణాన్ని ఆపకపోతే కోర్టుకెళ్తామని ఐవి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఆకిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

అదానీ ప్రయోజనాల కోసమే సిఎం పర్యటన

- జిసిసి మాజీ చైర్మన్ ప్రసాద్

ప్రజాశక్తి- కొయ్యూరు : అడవిని, పర్యావరణాన్ని నాశనం చేసే షిరిడి సాయి హైడ్రో పవర్ ప్లాంట్ కోసమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏజెన్సీ ప్రాంత పర్యటనకు వస్తున్నారని, తద్వారా కార్పొరేట్ సంస్థ అదాని ప్రయోజనాలను నెరవేర్చనున్నారని జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి.ప్రసాద్ ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆదివాసీ ద్రోహి జగన్ అని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న ఏడు ఆదివాసీ స్థానాల్లో వైసిపి వారిని ఎమ్మెల్యేలుగా గెలిపిస్తే, 40 లక్షలు ఉన్న మైదాన ప్రాంత బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చడం ద్వారా ఆదివాసీలకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. 1/70, పీసా చట్టాలను, జిఒ 3ను నిర్వీర్యం చేశారన్నారు. పంచాయతీ నిధులు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కొల్లగొట్టారని, ప్రత్యేక డీఎస్సీ తీస్తామని మాట తప్పారని పేర్కొన్నారు. ఇంతవరకు ఆదివాసీల పేరు మీద ఒక్క ఇళ్లైనా మంజూరు చేశారా? అని ప్రశ్నించారు. ఏజెన్సీలోని కొండదొర, భగత్, వాల్మీకి తదితర తెగలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కుటిల నీతిని ఆదివాసీలు గమనిస్తున్నారన్నారు. ఆదివాసీలకు ఇన్ని విధాలుగా ద్రోహం చేస్తున్న ముఖ్యమంత్రి ఏ ముఖం పెట్టుకొని ఏజెన్సీ ప్రాంతంలో అడుగు పెడుతున్నారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో రాజేంద్రపాలెం సర్పంచ్ పీట సింహాచలం, కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు, కొట్టేడి బాచ్చి, మాకాడ బూరుగులయ్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయండి

కొయ్యూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 21న గురువారం జిల్లాలోని చింతపల్లి మండలంలో పర్యటించనున్నారని, దీనిని విజయవంతం చేయాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబులు పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఆయన ఆదివాసీ ప్రాంతానికి రావడం శుభపరిణామన్నారు.

రేపు చింతపల్లికి సిఎం రాక



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి గురువారం పర్యటించనున్నారు. ఆ రోజు ఉదయం 9:00 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 9:50 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 10:00 గంటలకు విశాఖపట్నం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 10:30 గంటలకు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం చౌడపల్లి గ్రామానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో 10:45 గంటలకు బయలుదేరి చింతపల్లిలోని జెడ్‌పిహెచ్ స్కూల్‌కి వెళ్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తారు. 11.10 గంటలకు అక్కడ నుంచి చింతపల్లి డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. 12:30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 12:40 గంటలకు హెలిప్యాడ్ ప్రాంగణానికి చేరుకుంటారు. అనంతరం స్థానిక నాయకులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 1:30 గంటలకు చింతపల్లి మండలం చౌడపల్లి గ్రామం నుంచి బయలుదేరి 2:00 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 2:10 గంటలకు విజయవాడ బయలుదేరి వెళ్తారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యత : అమర్



మాట్లాడుతున్న మంత్రి అమర్

ప్రజాశక్తి -చింతపల్లి: రాష్ట్రంలోని విద్యార్థులు అందరికీ అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా విద్యాభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. స్థానిక సిఏహెచ్ పాఠశాలలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, విద్యా వ్యవస్థను డిజిటలైజేషన్ చేయడానికి, జీఆర్ ఈ, టోఫిల్ వంటి పరీక్షలు రాయడానికి విద్యార్థుల సామర్థ్యం పెరగడానికి ముఖ్యమంత్రి రూపకల్పన చేశారని చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 21న చింతపల్లిలో చేపడుతున్నామన్నారు. తన జన్మదినాన్ని గిరిజన విద్యార్థులతోనే చేసుకోవడానికి జగన్మోహన్ రెడ్డి అంగీకరించాలని మంత్రి అమర్నాథ్ తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు 1న వేతనాలు చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-పాడేరు: ఉద్యోగ , ఉపాధ్యాయులకు ప్రతినెలా ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. స్థానిక విలేకరులతో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు మంగళవారం మాట్లాడుతూ,ఉద్యోగ ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు, పెండింగ్ డిఎలు చెల్లిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెర వేర్చలేదని విమర్శించారు ఉద్యోగులకు 1న జీతాలు చెల్లించకపోవడంతో బ్యాంకులకు చెల్లించవలసిన నెల సరి వాయిదాలు చెల్లించ లేని పరిస్థితి నెల కొందన్నారు. దీనికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఈనెల 27వ తేదీ నుంచి ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

ఈనెల 27 డివిజన్ కేంద్రాల్లో 6 గంటల ధర్నా, జనవరి 2వ తేదీన జిల్లా కేంద్రంలో 12 గంటల ధర్నాలు, జనవరి 7 ,8 తేదీల్లో రాష్ట్ర కేంద్రంలో 36 గంటల ధర్నా చేస్తున్నామని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు మెమోరండాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అల్లూరి సీతారామరాజు జిల్లా సహాధ్యక్షులు సిహెచ్ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ కన్నయ్య పాల్గొన్నారు.



జెసికి కార్యాచరణ పత్రాన్ని అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎలు, సరెండర్ లీవులు తదితర సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ కార్యాచరణ నోటీసును మంగళవారం సాయంత్రం విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్‌కు యూనియన్ తరపున అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించే విధంగా నిబంధనలు ఉన్నప్పటికీ రెండు సంవత్సరాలుగా ఉల్లంఘనకు గురవుతున్నాయన్నారు. 15వ తేదీ వచ్చే వరకూ చాలామందికి జీతాలు చెల్లించడం లేదన్నారు. అందువల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. బ్యాంకు లోన్‌లు కలిగిన వారు సకాలంలో వాయిదాలు చెల్లించనందున పెనాల్టీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పిఆర్‌సి దాని ముందు నాటి డిఎ ఎరియర్లు జనవరి 2024 నుంచి 12 వాయిదాలలో చెల్లిస్తామని జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో హామీ ఇచ్చినప్పటికీ దానికి సంబంధించిన ఎటువంటి ఉత్తర్వులూ ఇప్పటి వరకూ ఇవ్వలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21 వరకూ జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులకు విజ్ఞాపన పత్రాలు అందజేస్తామని, 27న తాలూకా, డివిజన్ కేంద్రాలలో ఆరు గంటల ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. జనవరి 3న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 12 గంటల ధర్నా, 7, 8 తేదీలలో విజయవాడలో 36 గంటల ధర్నా ఉంటాయని తెలిపారు. వాటిని ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శులు రియాజ్, టి.జగన్ పాల్గొన్నారు.

21న వేటగాడు ఆడియో విడుదల

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వేటగాడు ఆడియో సీడీని ఈ నెల 21న టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఆవిష్కరిస్తారని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ తెలిపారు. వేటగాడు ఆడియో పోస్టర్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న వైసిపి అరాచక పాలన నేపథ్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను వివరించే క్రమంలో వేటగాడు ఆడియో సీడీని విడుదల చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, కార్తీక్ కుట్ట, ఈతలపాక సుజాత, బోడేపూడి దొరబాబు, డాక్టర్ పపూర్ నికుంజ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికా సాధికారతే లక్ష్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బాలికా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ (బిబిజి) ఛైర్మన్ మల్లికార్జున రెడ్డి మంగళవారం నగరంలోని ఓ హోటల్లో మీడియాకు తెలిపారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం రఘుమండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిబిజి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. బిబిజి బంగారు తల్లి అని, 2019లో స్థాపించిన లాభాపేక్ష లేని ఫౌండేషన్ అని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో బాలికల విద్యను ప్రోత్సహించడానికి చేపట్టిందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 2040 నాటికి 20 లక్షల మంది ఆడపిల్లల జీవితాలను మార్చడానికి ఉద్దేశించిదన్నారు.

ఐహెచ్.ఫరూకీకి అభినందనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్. రాష్ట్ర మైనార్టీల ఉపాధ్యక్షులుగా నియమితులైన ఐహెచ్.ఫరూకీని గురుస్థానం స్కూల్ డైరెక్టర్ ఎస్.ఖాన్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతిలో ఫరూకీ ఎంతో కీలకమైన, ప్రధానమైన పాత్ర పోషించారని తెలిపారు. మరింత అధికార పాత్ర పోషించాలంటే త్వరలో ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కోరారు.

వైసిపి ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం



మాట్లాడుతున్న హైమావతి, నేతలు

ప్రజాశక్తి-హుకుంపేట : మండలంలోని ఇసుక అక్రమ రవాణా వ్యాపారానికి అడ్డుపడుతున్నారని కారణంతో హుకుంపేట తహశీల్దార్ రాజ్యలక్ష్మి పై దాడికి ప్రయత్నం చేసిన తీగలవలస అధికార వైసిపి సర్పంచ్ పాంగి బేను, కొడుకు అర్జున్, తీగలవలస ఎంపిటిసి క్రాగ నాగరాజులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర నాయకురాలు సొంటెన హైమావతి, మండల కార్యదర్శి లక్ష్మణ్, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావులు డిమాండ్ చేశారు. స్థానిక విలేకర్లతో వారు మంగళవారం మాట్లాడుతూ,మండలంలోని దిగుడుపుట్టు, తీగలవలస పంచాయితీ గరుడపల్లి, కొట్నాపల్లి పంచాయితీ కొట్నాపల్లి గ్రామాలలో లక్షల విలువైన ఇసుక అక్రమంగా తవ్వి, లోడ్‌కు రూ 3000 నుండి రూ 6000 అమ్ముకుంటున్నారన్నారు.స్థానిక పంచాయితీ గిరిజన ప్రజలు ఇల్లు కట్టుకోవాలంటే ఇసుక దొరక లేదని చెపుతూ మాఫియాదారులుగా మారు తున్నారన్నారు.తీగలవలస సచివాలయం పేరిట రశీదులు ముద్రించి దర్జాగా ఇసుకను అమ్ముకుంటున్నారన్నారు. తహశీల్దార్ అనేక మార్లు అక్రమ ఇసుక రవాణా చేయవద్దని చెప్పినా వినకుండా, అధికార పార్టీ నేతలనే పేరు చెప్పి రవాణాకు పాల్పడుతున్నారన్నారు.

అసెంబ్లీ తీర్మానాన్ని వెనక్కు తీసుకోవాలి

ప్రజాశక్తి-చింతపల్లి:బోయ/వాల్మీకులను గిరిజన జాబితాలో కలపాలని అసెంబ్లీలో చేసిన తీర్మాణాన్ని వెనక్కి తీసుకొని సిఎం జగన్ ఆదివాసీ ప్రాంతంలో అడుగు పెట్టాలని ఆంధ్ర ప్రదేశ్ ఆదివాసి జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు డిమాండ్ చేసారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చింతపల్లి మండలం ఎర్రవరంలో హైడ్రోపవర్ ప్రాజెక్ట్ నిర్మాణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలన్నారు. జికె వీధి మండలం ఆర్వీనగర్ నుండి వై.రామవరం మండలం పాలగెడ్డ వరకు శిథిలమైన రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు మంజూరు చేయించాలన్నారు. కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

యువగళం సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న: దొన్ను దొర,వాసంశెట్టి సత్య

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: టీడీపి జాతీయ ప్రధాన నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సభకు అరకు నియోజకవర్గ నుండి అత్యధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొనాలని అరకు నియోజకవర్గ పరిశీలకులు వాసం శెట్టి సత్య, ఇంఛార్జి సివేరి దొన్నుదొర పిలుపునిచ్చారు. మండలంలోని పద్మాపురం ఉషోదయ రిసార్ట్స్‌లో స్థానిక విలేకరులతో మంగళవారం మాట్లాడారు. విజయనగరం భోగాపురం మండలం పొలిపల్లిలో జరిగే యువగళం పాదయాత్ర ముగింపు సభ కార్యక్రమానికి 80 వాహనాల్లో సుమారు ఆరు వేల మంది అరకు నియోజకవర్గం నుండి తరలివెళ్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పెదలబుడు సర్పంచ్ పి దాసుబాబు, నీరజ, సుబ్బారావు, కె.శ్యామ్, బొండం మాజీ సర్పంచ్ సుబ్బారావు, జగన్నధం పాల్గొన్నారు.

అపోలోలో అరుదైన ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స



డాక్టర్ ఎకె.ఖాన్

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖపట్నం అపోలో ఆసుపత్రి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, విభాగాధిపతి డాక్టర్ అబ్దుల్ ఖాన్ అత్యంత అరుదైన, చాలా సున్నితమైన శస్త్రచికిత్స ఇటీవల ఆసుపత్రిలో నిర్వహించారు. 54ఏళ్ల రోగికి థెరప్యూటిక్ హిండ్‌ఫుట్ ఎండోస్కోపిక్ కాల్కానియోప్లాస్టీ అనే ఆర్థోపెడిక్ సర్జరీని రాష్ట్రంలోనే తొలిసారిగా నిర్వహించి, ఒక్కరోజులోనే రోగిని డిశ్చార్జి చేసిన ఘనత సాధించారు. ఈ అరుదైన ఆపరేషన్‌కు సంబంధించిన చికిత్సా పత్రాలను ఈ నెల 14న లక్నోలో జరిగిన ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ వార్షిక సమావేశం, ప్రొఫెసర్ కేటి ధోలాకియా సిఎంఇలో డాక్టర్ ఎకె.ఖాన్ సమర్పించినట్లు వెల్లడించారు. అసోసియేషన్ వార్షిక సమావేశంలో రాష్ట్రం తరపున డాక్టర్ ఎకె.ఖాన్ ఒక్కరే పాల్గొనడం విశేషం.

మడమ నొప్పి, వాపుతో రెండేళ్లుగా బాధపడుతున్న 54ఏళ్ల రోగికి అవిశ్రాంతంగా అనాల్జెసిక్స్, బ్రేస్, ఫిజియోథెరపీ, స్టెరాయిడ్ ఇంజెక్షన్లను ఇచ్చినప్పటికీ ఎటువంటి ఉపశమనం లేకపోవడంతో అపోలో ఆసుపత్రికి వైద్యానికి వచ్చాడు. డాక్టర్ ఎకె.ఖాన్ ఆధ్వర్యంలో అపోలో ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్యనిపుణుల బృందం ఎంఆర్ఐ స్కాన్ చేసి, మడమ హగ్లండ్స్ వైకల్యాన్ని నిర్ధారించారు. వ్యాధి నివారణకు డాక్టర్ ఖాన్ థెరప్యూటిక్ హిండ్ ఫుట్ ఎండోస్కోపిక్ కాల్కానియోప్లాస్టీ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. రోగి బాగా కోలుకుని 24 గంటల్లో డిశ్చార్జ్ అయ్యాడు. దీనికి సంబంధించిన చికిత్సా పత్రాలను ఆర్థోపెడిక్ అసోసియేషన్‌లో సమర్పించిన డాక్టర్ ఖాన్‌ను పలువురు ప్రశంసించి, అభినందించారు.అపోలో ఆసుపత్రి ఘనతను పలువురు కొనియాడారు.

దక్షిణంలో వైసిపి కార్పొరేటర్ల తిరుగుబాటు

ఎమ్మెల్యే వాసుపల్లిపై విమర్శలు
నియోజకవర్గానికి కొత్త అభ్యర్థి కావాలని డిమాండ్



అభివాదం చేస్తున్న అధికార పార్టీకి చెందిన తిరుగుబాటు కార్పొరేటర్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో అధికార వైసిపి కార్పొరేటర్లు ఎనిమిది మంది ఒకేసారి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌పై తిరుగుబాటు చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కాకుండా కొత్త అభ్యర్థిని, అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తిని అధికార వైసిపి తరుపున పోటీకి నిలపాలని మంగళవారం సాయంత్రం ఆ కార్పొరేటర్లంతా డిమాండ్ చేశారు. నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో వైసిపి కార్పొరేటర్లు ఉరుకుటి నారాయణరావు (29వ వార్డు), కోడూరు అప్పలరత్నం (30వ వార్డు), బిపిన్ కుమార్ జైన్ (31వ వార్డు) విల్లూరి భాస్కరరావు (35వ వార్డు) మాసిపోగు మేరీజోన్స్ (36వ వార్డు), చెన్నా జానకిరామ్ (37వ వార్డు) కోడిగుడ్ల పూర్ణిమ (41వ వార్డు), ఆళ్ల లీలావతి (42వ వార్డు), పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే గణేష్ కుమార్ వ్యవహార శైలి నచ్చక దక్షిణ నియోజవర్గానికి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు కందుల నాగరాజు (32వ వార్డు), మహమ్మద్ సాధిక్ (39వ వార్డు) వైసిపిని వీడి ఇతర పార్టీలకు వెళ్లారని, వార్డుల నుంచి కార్పొరేటర్లు తీసుకువచ్చే ప్రజా సమస్యలను ఎమ్మెల్యే ఏమాత్రమూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయన వల్ల కార్పొరేటర్లుగా తాము పలు అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వెలిబుచ్చారు. ఎమ్మెల్యే తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలను కార్పొరేటర్లు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. అయితే తాము వేరే పార్టీకి వెళ్లేది లేదని, 2024 ఎన్నికల్లో తిరిగి వైసిపిని అధికారంలోకి తేవడానికి తామంతా గట్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అధికార వైసిపి కార్పొరేటర్లు నిర్వహించిన ఈ సమావేశం ఎమ్మెల్యే గణేష్ కుమార్‌కు రాజకీయంగా గట్టి దెబ్బ అని చెప్పవచ్చు. రానున్న రోజుల్లో దక్షిణ నియోజకవర్గం వైసిపిలో ఎటువంటి మార్పులు చోటు చేసుకుంటాయో తెలియాల్సి ఉంది.

బాలవికాస్ గురువు సత్యప్రభ కన్నుమూత

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అద్భుత బాలవికాస్ గురువు ఇంద్రకంటి సత్య ప్రభ (62) మంగళవారం నగరంలోని తన ఇంటిలో కన్నుమూశారు. శ్రీ సత్య సాయి సేవా సంస్థల విద్యా విభాగం బాలవికాస్‌లో 30 ఏళ్లకు పైగా విశేష కృషి చేసిన సత్యప్రభ వృత్తిరీత్యా రైల్వేలో చీఫ్ సూపరింటెండెంట్‌గా పని చేసి మంచి అధికారిణిగా అందరి ప్రశంసలు అందుకున్నారు. దాదాపు 30 సంవత్సరాలు శ్రీ సత్యసాయి సేవా సంస్థల ద్వారా విద్యా సేవలో, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని వారికి మానవతా విలువలతో కూడిన బాల వికాస్ అభివృద్ధికి కృషి సలిపారు.

టిడిపిలో అంతర్గత పోరు

యువగళంలో బయటపడ్డ అసంతృప్తి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సమయాన ఆ పార్టీలో అంతర్గత పోరు బయటపడింది. నాయకత్వం మధ్య సమన్వయలేమి, ఆధిపత్యం, బలప్రదర్శన వంటి పోకడలు ప్రస్ఫుటంగా వ్యక్తమయ్యాయి. మిత్ర పార్టీల నాయకుల మధ్య ఆధిపత్యపోరు వుండగానే, మరోవైపు అనకాపల్లి ఎంపీ టిక్కెట్ విషయమై కొత్త సమస్యలు ముందుకురావడం టిడిపికి తలనొప్పిగా మారింది. మాజీ మంత్రి, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా పోటీచేయాలని భావిస్తున్నారు. ఎంతో కాలంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న తనకు ఎంపీ టిక్కెట్ వస్తుందన్న ఆశాభావంతో విజయ్ వున్నారు. యువగళం పాదయాత్రలో ఆయనకు కీలకమైన బాధ్యతలను పార్టీ అప్పగించింది. జిల్లాలోని టిడిపి శ్రేణులతో పార్టీపరమైన సంబంధాలూ ఆయనకు వున్నాయి. అయితే అనకాపల్లి నుంచి టిడిపి తరపున ఎంపీగా పోటీ చేయాలని బైరా ఫౌండేషన్ ఛైర్మన్ బైరా దిలీప్ చక్రవర్తి ప్రయత్నిస్తున్నారు. ఆయన యువగళం పాదయాత్రతో ఒక్కసారి తెరమీదకొచ్చారు. స్థానిక నాయకులెవరూ పెట్టనన్ని ఫ్లెక్సీలు పాదయాత్ర పొడవునా ఏర్పాటు చేసుకొని లోకేష్, స్థానిక పార్టీ శ్రేణులను ఆకర్షించే ప్రయత్నం చేశారు. దిలీప్ చక్రవర్తిని పార్టీ అధిష్టానం ప్రోత్సహిస్తున్నట్లు భావించి జిల్లా నాయకత్వం అసంతృప్తి వ్యక్తంచేసింది. చక్రవర్తిని ప్రోత్సహించి తప్పుడు సంకేతాలు పంపవద్దని అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రచారం కూడా సాగింది. యలమంచిలి నియోజకవర్గంలో ఫెక్లీల పోరు ఎక్కువగా కనిపించింది. జాతీయ రహదారి నుంచి యలమంచిలి ప్రవేశ మార్గంలో విజయ్ ప్రత్యేక ఆకర్షణగా స్క్రీన్‌లు, ఫ్లెక్సీలు పెట్టారు. లోకేష్‌ను అయ్యన్న కుటుంబ సభ్యులు గజమాలతో ఆహ్వానించారు. పాదయాత్రలో దిలీప్ చక్రవర్తి ఫ్లెక్సీలపై చర్చ జరిగింది. బైరా ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలతో దిలీప్ చక్రవర్తి పరిచయాలు పెంచుకోవాలని చూస్తున్నారు. చక్రవర్తిని ప్రోత్సహించడం సరికాదంటూ లోకేష్‌తో అయ్యన్న అనడంతో విజయ్ టిక్కెట్ పట్ల సానుకూలతతో మాట్లాడినట్లు తెలిసింది. జిల్లాలో సాగిన పాదయాత్రలో లోకేష్‌తో పాటు విజయ్ పాల్గొని ఎంపీగా పోటీ చేయబోతున్నానన్న సంకేతాలు ఇచ్చారు.

నెల రోజుల్లో ముగ్గురు చిన్నారులు మృతి



పరామర్శిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి - అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా పంచాయతీ పరిధిలో నెల రోజులలో ముగ్గురు పసికందులు అనారోగ్యంతో మృతి చెందారని సిపిఎం జెడ్పిటిసి కిసరి గంగరాజు తెలిపారు. బొర్రా గేటువలస గ్రామానికి చెందిన సురబోయిన సవర్ల జన్మించిన నాలుగు నెల పసికందు మృతి చెందిన విషయం తెలుసుకున్న గంగరాజు మంగళవారం గ్రామంలో సందర్శించారు. మృతుల కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీ గ్రామంలో పసి కందులు మృతి చెందుతున్నా వైద్యులు ఎందుకు పట్టించుకోలేదని ఆయన ప్రశ్నించారు.

సర్వశిక్ష ఉద్యోగుల నిరసన



డుంబ్రిగుడలో ప్లకార్డులతో నిరసన చేపడుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్ఎ ఉద్యోగులు ఈనెల 16 నుంచి చేపడుతున్న పెన్ డౌన్ కార్యక్రమం మంగళవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో వెయిటేజ్ కల్పించాలని, అన్ని పోస్టులకు ఖచ్చితమైన జాబ్ చార్ట్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్ఎంటి సిబ్బంది, కేజీబీవీ, పిటిఐ, ఐఆర్పి సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి:సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల వద్ద ప్ల కార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ, ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ సమస్యలు పరిష్కరించేవరకు విధులను బహిష్కరించి సమ్మె చేపడతామని ఆయన స్పష్టం చేశారు

మంచు తెరల్లో మన్యం



దట్టంగా కురుస్తున్న మంచు

ప్రజాశక్తి- డుంబ్రిగుడ : మండలంలో చలి తీవ్రత రోజు రోజుకు పెరుగుతుంది. గత నాలుగు రోజుల నుంచి మండలంలో దట్టమైన పొగ మంచు కురుస్తోంది. ఉదయం తెల్లవారు నుంచి సుమారు 9 గంటల వరకు మంచు కురుస్తుండటంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం సాగించారు.చలి తీవ్రతకు తట్టుకోవడానికి గిరిజనులు చలి మంటలను వేసుకుంటున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మెడికల్ రిప్స్ సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బుధవారం నుంచి తలపెట్టిన సమ్మె పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షులు పివి.సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.స్రవంత్ మాట్లాడారు. 1976లో ఏర్పడిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్ ఇంతవరకు అమలు జరగలేదన్నారు. సరికదా కేంద్ర ప్రభుత్వం ఈ యాక్ట్‌కు తూట్లు పొడుస్తోందని తెలిపారు. తక్షణం ఈ యాక్ట్‌ను పునరుద్ధరించాలని, మెడికల్ రెప్రజెంటేటివ్స్‌కు చట్టబద్ధమైన పని విధానాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి మాట్లాడుతూ మందుల ధరలు తగ్గించాలని, అత్యవసర నిత్యవసర మందులను ప్రభుత్వ ఆసుపత్రిలో పేదవారికి ఉచితంగా ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ రంగ మందుల కంపెనీలైన హెచ్ఎల్ లాంటి కంపెనీలను పునరుద్ధరించాలని, మందులు, మందుల పరికరాలపైనా జిఎస్‌టిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు సంజయ్ కుమార్, జాతీయ కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు, జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, కె.కిరణ్ చౌదరి పాల్గొన్నారు.



స్మార్ట్ ఆరోగ్య శ్రీ కార్డును అందజేస్తున్న మేయర్

స్మార్ట్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రతి పేదవాడికీ మెరుగైన ఉచిత కార్పోరేట్ వైద్యం అందించేందుకు వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీకి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరింత జీవం పోసారని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. మంగళవారం ఆమె పూర్ణ మార్కెట్ మున్సిపల్ స్టేడియం వద్ద స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్మన్ కొల్లి సింహాచలంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రస్తుతం ఉన్న రూ.5 లక్షల పరిధిని రూ. 25 లక్షలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెంచారని తెలిపారు.

రాజకీయంగా అడ్డుకోలేకే వ్యక్తిగత విమర్శలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాజకీయంగా అడ్డుకోలేక తాను అవినీతి బాగోతాలు చేస్తున్నానని వ్యక్తిగత విమర్శలను తనపై చేస్తున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ మేయర్, షాడో మేయర్లు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని విశాఖ ప్రజలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని ఆరోపించారు.